ప్రజాశక్తి
ఆదివారం 5 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం

సాలూరులో నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం మెగా జాబ్ మేళా జరగనుందని, నిరుద్యోగ యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకుని 18-28 ఏళ్లువయసు గల నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈనెల 5న ఉదయం 9గంటల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్ప్ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఇతర వివరాలకు 94947 77553, 73825 59022 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

వచ్చే ఏడాదికి బాలికల జూనియర్ కాలేజి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో వచ్చే ఏడాది విద్యాసంవత్సరం నాటికి బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికపరమైన ఇబ్బందులు, పౌష్టికాహార లోపం కారణంగా ఉన్నత చదువులకు దూరం కాకుండా డ్రాపౌట్స్‌ను తగ్గించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 5800 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నామన్నారు. విద్యార్థుల ఆహార అలవాట్ల ప్రకారం జోన్లు వారీగా మధ్యాహ్నం భోజన పథకం అందించనున్నామన్నారు. అలాగే విద్యార్థులు ఎన్ఐటి, ఐఐటి, ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించేలా ఐఐటి నుండి నిష్ణాతులైన అధ్యాపకులను రప్పించి పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సబ్జెక్టుల్లో శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం కింద ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్నామన్నారు. ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న కార్యదీక్షతో విజయాలను సొంతం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలు గంజాయి వంటి చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ వంటి మహానీయుల పేరున మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం అందరికీ గర్వకారణం అన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా బలవర్ధక పౌష్టికాహారాన్ని అందించడం వల్ల పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి సారించవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు తీసుకొచ్చిందని విద్యార్థుల ఇష్టం మేరకు ఆయా మెనూలను అమలు చేయనున్నామని తెలిపారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ స్వయంగా భోజనాన్ని వడ్డించి, వారి మధ్య సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు పలువురు విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు, సానిటరీ ప్యాడ్స్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వత్తి విద్య అధికారి

విద్యార్థులకు ఒడ్డిస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వి. మంజులా వీణా, కళాశాల ప్రిన్సిపల్ బి. మురళీధర్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు నిరుపేదలని, వారికి సరైన పౌష్టికాహారాన్ని అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటునందించాలని గుర్తించిన ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టిందని కావున విద్యార్థులు మంచిగా విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు రెండు జతల యూనిఫారాలు, షూస్ పంపిణీ బాధ్యతను తాను తీసుకుంటామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా విద్యార్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ జె.రామారావు, డిపిఆర్ఒ ఎల్.రమేష్, ఎంఇఒలు విమలకుమారి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శివనారాయణ, తహశీల్దారు వై.జయలక్ష్మి. ఎంపిడిఒ కె.రూపేశ్ ఎన్ఎస్ఎస్ పిఒ టి.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానికజూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, జియమ్మవలస మండల కన్వీనర్ పల్ల రాంబాబు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ సొంటేన రాజేష్, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, హెచ్ఎం బిడ్డిక భీముడు, ఎల్విన్ పేట ఎస్ఐ బిడ్డిక శివ ప్రసాద్, కూటమి నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని డిఇఒ ఎన్.తిరుపతిరావు ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సమయ భావనతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటుతో వారు మరింత విద్య నేర్చుకోడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఎంఇఒలు జామి నారాయణస్వామి, తిరుపతిరావు, రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శేఖర్ పాత్రుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి.సుదర్శన్ రావు, ఉపాధ్యక్షులు మధుసూదనరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోట వెంకటనాయుడు, సీనియర్ నాయకులు పొట్నూరు వెంకట నాయుడు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించి, డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు నిరుపేదలని, వారికి సరైన పౌష్టికాహారాన్ని అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటునందించాలని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంట పాత్రలకు తన వంతుగా పాలకొండ పట్టణ టిడిపి సీనియర్ నాయకులు పల్లా కొండలరావు లక్ష రూపాయలు చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.హర గోపాల్ బాలిక కళాశాల ప్రిన్సిపల్ బి రేణుక, కూటమి నాయకులు, ఎంఇఒలు, అధ్యాపకులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాల హరిబాబు. రౌతు వేణుగోపాల్ నాయుడు, పెంట సత్యంనాయుడు. కంకణపల్లి అరవింద్, బి.లక్షణరావు, కాలేజీ ప్రిన్సిపల్ దాలినాయుడు ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు, తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంఇఒ సూర్యదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిపి బి.ప్రమీల, వైస్ ఎంపిపి ఎం.నారాయణ, ప్రిన్సిపల్ కె.ఝాన్సీ, సర్పంచ్ పి.సంతోషి, దండి ఏడుకొండలు. గూడెపు యుగంధర్, ముఖీ సూర్యనారాయణ, పి.నరసింగరావు, కె.సురేష్, చల్లా కనకారావు, ఎడ్ల రమేష్. విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : డొక్కా సీతమ్మ ఎండిఎం పథకాన్ని కళాశాల విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి కన్వీనర్ కె వి కొండయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ ఎండిఎం పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.ఉషారాణి, టిడిపి నాయకులు చందక రామకృష్ణ, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

రవాణా సంక్షోభానికి ప్రభుత్వ విధానాలే కారణం

- కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి - సాలూరు

రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమని ఆలిండియా ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య చెప్పారు. శనివారం స్థానిక లారీ యజమానుల సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లి మధుసూదనరావు అధ్యక్షతన నిర్వహించిన మోటార్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విజయవాడ తర్వాత లారీలు ఎక్కువగా ఉన్నది సాలూరు ప్రాంతంలోనేనని చెప్పారు. అనేక ఏళ్లుగా మోటార్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులను ప్రతిరోజూ చేరవేస్తున్నది రవాణా రంగమేనని చెప్పారు. ఇలాంటి రంగానికి కీలకమైన కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర బాగా తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి లీటర్ డీజిల్ ధర రూ.56 ఉండేదని చెప్పారు. అప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర ఎక్కువగా ఉండేదన్నారు. ఇప్పుడు ముడిచమురు ధర 73 డాలర్ల కనిష్ట ధరకు లభిస్తున్నా డీజిల్ ధరలు తగ్గడం లేదన్నారు. 2014లో వాహనాల ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.23,075 ఉంటే అది ఇప్పుడు రూ.43వేలకు పైనే ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గినప్పుడు ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలన్నారు. కానీ దేశంలో వాహనాల ఇన్సూరెన్స్ ప్రీమియం పెరుగుతోందన్నారు. డీజిల్ పై కేంద్రం విధించిన సెస్ 2017 వరకూ రూ.3 ఉండగా, ప్రస్తుతం రూ.8 పెరిగిందని చెప్పారు. గత ఆరేళ్లుగా డీజిల్ సెస్ వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం టోల్ ట్యాక్స్ ఎందుకు వసూలు చేస్తోందని ప్రశ్నించారు. రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణాలన్నారు. మరోవైపు స్పేర్ పార్టుల ధరలు భారీగా పెరిగాయని చెప్పారు. పెరిగిన పన్నులకు అనుగుణంగా లారీల కిరాయి రేట్లు పెరగడం లేదన్నారు. 2019 మోటార్ వాహనాల చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత లారీ డ్రైవర్లపై జరిమానాలు పెరిగాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు భారీగా జరిమానాలు పెంచినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెపుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 67 శాతం ప్రమాదాలు జాతీయ రహదారులపైనేనని, ఈ రహదారుల నిర్మాణంలో లోపాల కారణంగానే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎక్కువ దూరం ప్రయాణించే లారీ డ్రైవర్లకు కనీసం జాతీయ రహదారుల పక్కన విశ్రాంతి గదులు కూడా లేవన్నారు. ఇప్పటికే రవాణా రంగం లో డ్రైవర్ లు తక్కువ గా వున్నారని, వున్నవారిపై కేసులు, జరిమానాలు విధించి ఆ రంగం నుంచి తప్పుకునేలా ప్రభుత్వ విధానాలు మారుతున్నాయని చెప్పారు. రవాణా రంగం లోకి కార్పొరేట్ కంపెనీలను అనుమతించే యోచనలో కేంద్ర ప్రభుత్వం వుందన్నారు. రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి సంఘటిత పోరాటాలే శరణమని చెప్పారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన రైతులు మాదిరిగా మోటార్ కార్మికులు కూడా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈనెల 8,9 తేదీల్లో ఆలిండియా ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సమావేశం విజయవాడలో జరుగనుందని, ఆ తర్వాత బడ్జెట్ సమావేశాల్లో చలో పార్లమెంటు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఈ ప్రాంతం నుంచి కార్మికులు హాజరు కావాలని లక్ష్మయ్య కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సిడిపిఒలను హెచ్చరించారు. ప్రతి కేంద్రంలో శత శాతం పిల్లలు హాజరు ఉండాలని, భోజనం సమయానికి కాకుండా నిర్దిష్ట సమయానికే పిల్లలు కేంద్రానికి వచ్చేలా చూడాలని అన్నారు. మీరిచ్చే నాణ్యమైన ఆహారం వల్ల వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాల్సి ఉన్నప్పటికీ కొందరి పిల్లలు ఆ విధంగా లేకపోవడంపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు, ఇతర కొలతలు తీసుకోవాలని, తక్కువగా ఉంటే సంబంధిత సిడిపిఒలే బాధ్యత వహించాలని అన్నారు. నులి పురుగుల సమస్య ఉన్న పిల్లల్లో ఎదుగుదల ఉండదని, కావున ఏడాది దాటిన పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. గర్భిణిల్లో అనీమియా ఉండరాదని, సిడిపిఒలు అంగన్వాడీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి స్వయంగా పరిశీలించాలని అన్నారు. బాగా పనిచేసిన అంగన్వాడీ వర్కర్ల పేర్లను గణతంత్ర దినోత్సవ అవార్డులకు ప్రతిపాదించాలని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గను ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని, వధూవరుల తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలని డిసిపిఒలను ఆదేశించారు. బాల్య వివాహాలు నిర్మూలన, 1098పై పోస్టర్లు అతికించడం, కళాజాతల ద్వారా ప్రదర్శనలు, వాల్ పెయింటింగ్స్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్మోహన్ రావు, జిల్లా శిశు సంరక్షణ అధికారి సత్యనారాయణ, టాటా విజయవాహిని ట్రస్ట్ సుబ్రహ్మణ్యం, సీడీపీఒలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి - వీరఘట్టం

పార్వతీపురంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థికి జిల్లాలో ద్వితీయ స్థానం లభించడంతో శనివారం ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్ను వెంకటరావు, ఎ.చంద్రమౌళి, ఎస్.రవికుమార్, రత్నకుమారి. తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిఎంహెచ్ఒ

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు శనివారం గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే కోరారు. ఎల్లవేళలా ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో వైద్యసేవలందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినోద్ ఉన్నారు.

దేశ సమైక్యత, మతసామరస్యమే ధ్యేయం

- ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో రామ్మోహన్
- పట్టణంలో విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మతోన్మాద శక్తులు అనేక రూపాల్లో దాడి చేస్తున్నాయని, దీన్ని ముక్తకంఠంతో విద్యార్థులంతా వ్యతిరేకించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా 32వ మహాసభలు సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్ వరకు విద్యార్థుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రామ్మోహన్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం ప్రజల నడుమ నెలకొల్పినప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగానికి, మహిళలకు, విద్యార్థినిలకు, ఎవరికీ ఎటువంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పోరేట్లకు అప్పజెప్పి దేశ సంపదను లూటీ చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ భద్రత లేక యువత పెడమార్గం వైపు వెళ్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం దశాబ్ద కాలంగా మన రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తూనే ఉందని, దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలందరినీ చీల్చి మతం, కులం పేరుతో కుతంత్రాలు చేస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల బిజెపికి ఎటువంటి గౌరవం లేదని, అమిత్ షా అంబేద్కర్ను అవమానించి, దేశ ప్రధాని మోడీ వత్తాసు పలకడం ద్వారానే వారి ఉద్దేశం తేటతెల్లమైందన్నారు. కావున విద్యార్థులంతా అంబేద్కర్ వారసులుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్షిప్, అమ్మఒడి బకాయిలను విడుదల చేయకుండా లడ్డు రాజకీయాలు చేపడుతున్నాయని విమర్శించారు. జిల్లాలో విద్యార్థులు పిట్టల రాలిపోతున్నా గిరిజన మంత్రులు ఉంటున్నప్పటికీ కనీసం నివారణ చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని వాపోయారు. వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపి ఎన్జీఓ హోమ్ లో ప్రతినిధుల సభ ప్రారంభించారు. మొదటగా మహాసభల ప్రారంభ సూచికగా స్వాతంత్రం, ప్రజాస్వాగతం, సోషలిజం లక్ష్యాలతో కూడిన పతాకాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు ఆవిష్కరణ చేశారు. అనంతరం భగత్ సింగ్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అలాగే ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తదితరులకు సంతాపం తెలిపారు. ఈ సభకు డివైఎఫ్ఐ, ఐలు జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు, జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, అఖిల్, సింహాచలం, సురేష్, శివ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహనరావు

రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 7,8, 10 తేదీల్లో పార్వతీపురం, పాలకొండ డివిజన్ కార్యాలయాల్లో హైబ్రిడ్ విధానంలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన చెప్పారు. జనవరి 7,8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ 'ఎ' కన్వెన్షన్ సెంటర్ నుంచి జనవరి 10న కర్నూలు కమిషన్ ఆఫీస్ నుంచి ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు వినడం జరుగుతుందన్నారు. ఈ ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులు పాల్గొనవచ్చునని, ఈ మేరకు రిజిస్ట్రేషన్‌కు స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో (ఎస్.ఈ. ఆఫీస్) లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో (ఇఇ ఆఫీస్) సంప్రదించాలని కోరారు. ప్రతి రోజు ముందుగా నమోదు చేసుకున్న వినియోగదారుల అభ్యంతరాలు విన్న తర్వాత విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నమోదు చేసుకోవాలన్నారు,.

8న పార్కింగ్ స్థలాలకు వేలం పాట

ప్రజాశక్తి - మక్కువ

ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న పోలమాంబ అమ్మవారి జాతరకు ఏర్పాటు చేయబోయే దుకాణాలకు సంబంధించి ఈనెల8న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి దేవకుమార్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొన్న వారు పార్కింగ్, హోటల్స్, అంగడులకు సంబంధించి ధరావత్తు రూ.20వేలు గ్రామపంచాయతీకి చెల్లించి మధ్యాహ్నం 1:30కు శంబర గ్రామ సచివాలయానికి హాజరు కావాల్సిందిగా తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు వేలంపాట ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు సచివాలయ కార్యదర్శిని సంప్రదించాలని ఆయన తెలిపారు

మతోన్మాద చర్యలను ఖండించండి

ప్రజాశక్తి - సాలూరురూరల్

దేశ సమైక్యత, మతసామరస్యం, స్వేచ్ఛ సమానత్వం ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందుకు అడిగేద్దామని, భారత రాజ్యాంగాన్ని కాపాడుదామనే కరపత్రాన్ని మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ తుపాకీవలస సిపిఎం నాయకులు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు మాట్లాడుతూ స్వేచ్ఛ, సామరస్యం సమానత్వం ఉన్నప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలెవరికీ ఎటువంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తూనే ఉందని, దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల మధ్య చీలిక తెచ్చి మతం, కులం పేరుతో కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. మనమంతా భారతీయులమంటూ మత స్వేచ్ఛను గౌరవిద్దామని,భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామంటూ సిపిఎం చేస్తున్న పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే భవిష్యత్తులో దేశ సంపదను, సార్వభౌమాత్వాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సాలూరు మండల సిపిఎం కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సభ్యులు వంతల సుందర్రావు, కునేటి చినబాబు, వంశి, శ్రీను, కోమన్న తదితరులు పాల్గొన్నారు

ఓడదాటాక బోడిమల్లన్న



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఒడ్డుదాటే వరకు ఓడ మల్లన్నా అంటూ బతిమాలాడి... తీరా ఒడ్డుకు చేరాక బోడి మల్లన్న అన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ అమలుపై అచ్చంగా ఇదే సామెతను గుర్తు చేస్తోందని అంటున్నారు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజానీకం. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! నిన్నగాక మొన్న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపట్ల ఆద్యంతం విస్తుపోతున్నారు. గడిచిన ఎన్నికల్లో మునుపటి ప్రభుత్వాన్ని మట్టికరిపించి మరీ టిడిపి, జనసేన పార్టీలకు అధికారం కట్టబెట్టారు. ఇందుకు రెండు కారణాలు. జగన్ ప్రభుత్వం అవలంభించిన అణిచివేత చర్యలు, విధానపరమైన అంశాలు, అమలు కానికొన్ని హామీలు. గత ఎన్నికల్లో సిఎం చంద్రబాబు ప్రధానంగా అధిక ధరలు, పన్నుల భారాలు, విద్యుత్ ఛార్జీలను బాదుడే బాదుడు అంటూ వ్యంగ్యాస్త్రాలతో విమర్శలు గుప్పించారు. దీనికితోడు అమ్మఒడి పథకం ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ వర్తింపజేస్తామని చెప్పారు. రైతులకు జగన్ ఇస్తున్న రూ.15వేల రైతు భరోసా పథకాన్ని పెట్టుబడి సాయం పేరిట రూ.20వేలకు, మత్స్యకారులకు చెల్లించే జీవన భృతిని రూ.20వేలకు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం ఇలా ఒకటేమిటి? ఎన్నికల్లో అప్పటి జగన్ ప్రభుత్వం ప్రకటించిన మేనిఫెస్టో కన్నా ఎక్కువ ఆర్థిక సాయాన్ని అందిస్తామని, అందుకోసం గెలిపించాలని కోరి ఓట్లను ఆర్జించారు. ఉద్యోగాల కోసం డిఎస్సీ, ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపన వంటి చర్యలు తీసుకోనున్నట్టు జనాన్ని ఆశల పల్లకిలోకి దింపారు. ఆ మాటలు కోటలు దాటినా ఆచరణ గడప దాటడం లేదు. దీంతో, బాబు ప్రభుత్వం గెలిచిన తర్వామాట మార్చారని జనంలో చర్చనడుస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటున్న చంద్రబాబుకు, ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సహా పరివారానికి ఎన్నికల ముందు ఈ పరిస్థితులు తెలియవా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా లక్షల మంది ఎదురు చూస్తున్న తల్లికి వందన పథకం ఆచూకీ లేదు. పైగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేయడానికి నిర్ణయం జరిగిందన్న విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ డబ్బులు వస్తాయన్న ఆశతో అప్పుచేసి ఫీజులు కట్టామని కొందరు, ఆ పథకాన్ని ఆశగా చూపించి యాజమాన్యాలను ఇన్నాళ్లు ఒప్పించామని, ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదని ఇంకొందరు చర్చించుకుంటున్నారు. ఇక మెగా డిఎస్సి వచ్చే అకడమిక్ ఇయర్‌లో తీయాలని నిర్ణయం చేయడంతో మరో ఏడాది ముందుకు వెళ్లిపోయినట్టే. ఇక ఇదిగో అదుగో అంటున్న మహిళలకు ఉచిత ఆర్టీసి ప్రయాణం కూడా ప్రహసనంగానే మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు, అంతకుముందు ఏర్పడిన వర్షాభావానికి రైతులు పెట్టుబడి పెరిగిపోయింది. రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం మాత్రం గడప దాటలేదు. దీంతో, రైతులు ప్రభుత్వ తీరుపై ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల మూత వల్ల ఉద్యోగ, ఉపాధి కోల్పోయినవారు ప్రభుత్వం మారితే తిరిగి బతుకుతెరువు దొరకుతుందను కున్నారు. ధరలు అదుపు చేయలేదని, పైగా జగన్ విద్యుత్ ఛార్జీలు పెంచడాన్ని బాదుడే బాదుడు అన్న టిడిపి రెండు దఫాలు పెంచిందని, బాబు వచ్చాక తగ్గించలేదు సరికదా నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోయాయని పబ్లిక్ టాక్ నడుస్తోంది.

లారీ ఓనర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా గొర్లి మాధవరావు

ప్రజాశక్తి - సాలూరు

ఉమ్మడి జిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా గొర్లి మాధవరావు (మధు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతనెల 27న స్థానిక లారీ యజమానుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో మాధవరావుతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక లారీ యజమానుల సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర సంఘం కార్యదర్శిగా మాధవరావు ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఉమ్మడి సంఘం ఉపాధ్యక్షుడిగా చల్లా శ్రీనివాసరావు, కార్యదర్శిగా నంబియార్ వేణుగోపాలరావు, కోశాధికారిగా మండల ఈశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ అక్బర్, సంఘం సభ్యులుగా జి.శ్రీనివాసరావు, మీసాల తవిటినాయుడు, కర్రి శేషు, పప్పల శ్రీనివాసరావు, చిక్కాల బాబ్జీ, షేక్ కరీం ఎన్నికయ్యారు.

ఎపి ఎన్‌జిఒ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొండ

ఎపి ఎన్జీవో పాలకొండ మండలం క్యాలెండర్‌ను శనివారం సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఉన్న సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లగా, సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎపి ఎన్జీవో సంఘం గౌరవ అధ్యక్షులు లిల్లీ పుష్పనాధం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షులు కె.రంగచారి, ప్రధానకార్యదర్శి పైల ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు జి.నాయుడు, ఇన్‌ఛార్జి ఎఒ ఎంఎన్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కురుపాం

రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎం.రవణమ్మ కోరారు. శనివారం స్థానిక సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ముటేషన్లు, పేర్లు మార్పిడి తదితర భూ సమస్యలతో బాధపడుతున్న రైతులు వినతి పత్రాలు అందిస్తే పది రోజుల్లో వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు మహేంద్ర, జి.ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు .

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్రలో గల అంగన్వాడీ కేంద్రాన్ని ఆర్బిఎస్ కె ప్రోగ్రాం జిల్లా అధికారి డా. రఘుకుమార్ శనివారం తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లల ఆరోగ్య వివరాలు, వారి బరువు, ఎదుగుదల స్థితి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేకత శ్రద్ధ తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు వారికి ఇవ్వాలని, ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బంది వచ్చినా మా సిబ్బంది అందుబాటులో ఉన్నారని సూచించారు. వెల్నెస్ సెంటర్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ కుమార్, సూపర్వైజర్ ప్రసాద్, ఎఎన్ఎం మాలతి, అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురంలో శనివారం నిర్వహించిన జిల్లా యూత్ ఫెస్టివల్ పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థిలు ప్రతిభ కనపర్చినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న యు. ఉదయ్‌కిరణ్, దిలీప్ జిల్లా యూత్ ఫెస్టివల్ పోటీల్లో సైన్స్, టెక్నాలజీ విభాగంలో ప్రదర్శించిన సెన్సార్‌తో పనిచేసిన ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ప్రాజెక్టుకు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు మెంటర్‌గా వ్యవహరించిన శివప్రసాద్‌ను హెచ్‌ఎం అభినందించారు.

పేదలకు దుప్పట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శనివారం గుమ్మలక్ష్మీపురంలో పేదలకు, పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. శీతాకాలం నేపథ్యంలో ఏజెన్సీలో చలి తీవ్రత ఉన్న కారణంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చైర్మన్ శ్రీరాములు తెలిపారు. భవిష్యత్తులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

పడాల భూదేవికి సన్మానం

ప్రజాశక్తి - పాలకొండ

భూదేవిని సన్మానిస్తున్న మంత్రి

గుంటూరు జిల్లా వడ్లమూడిలో విజ్ఞాన్ యూనివర్సిటీ, రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాలు, అభ్యుదయ రైతుల అవార్డుల ప్రధానోత్సవంలో అభ్యుదయ రైతులకు అవార్డులు ప్రధానం చేశారు. ఇందులో భాగంగా నారీశక్తి రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య సన్మానించారు.

అంకిత భావంతో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామీణ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా హెల్త్, వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ పేర్కొన్నారు. మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సిని శనివారం పరిశీలించారు. ముందుగా సిబ్బంది హాజరు నమోదు, రోగుల ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు పరిశీలించారు.అనంతరం కృష్ణపల్లి సచివాలయ పరిధిలో గల హెల్త్ వెల్నెస్, పెదమరికి సచివాలయం పరిధిలో గల కొత్తఊరులో అంగన్వాడీ కేంద్రాల్లో టీకా కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు జయగౌడ్, శంకరరావు, ఎఎన్ఎంలు నిర్మల, కష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పిలు శిరీష, నిహారిక, ఆశాలు పాల్గొన్నారు.

రెండో రోజు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో సంకల్ప పథకం ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అవగాహన సదస్సు ఎపిఎం ఆర్.శ్రీరాములు పర్యవేక్షణలో రెండవ రోజు శనివారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జరిగింది. ఇందులో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి కె సాయికృష్ణ చైతన్య వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో 30 మంది యువతీ యువకుల పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీరఘట్టం : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల స్థానిక ఎస్సై జి కళాధర్ వాహనదారులకు సూచించారు. మండలంలోని రేగులపాడు గ్రామ జంక్షన్లో వాహనదారులతో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరూ. ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

సీతానగరం : సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారుడు తప్పక లైసెన్సు కలిగి, హెల్మెట్ ధరించాలన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రయాణికులను పరిమితి మించిన డ్రైవర్లు ఎక్కించరాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో జిల్లా విద్యార్థులు పోటీపడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయస్థాయిలో జరిగే యువజన ఉత్సవాల్లో జిల్లా విద్యార్థులు పోటీపడాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విద్యార్థులకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే జిల్లా విద్యార్థులకు తాను నిధులు సమకూరుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, ఎన్‌వైకె ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలు శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజహితం కోసం ఎంతో కృషిచేసిన స్వామి వివేకానంద, డా.బి.ఆర్.అంబేద్కర్ జీవితాలు ప్రజల మదిలో చిరస్థాయిగా మిగిలిపోయాయని, అలాగే నేటితరం సమాజం కోసం నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాకు ఒక చరిత్ర ఉందని, జిల్లా పేరు దశదిశలా మారుమ్రోగేలా యువత నడుచుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు రూపకల్పన చేసిన విద్యా, వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలను ఆయన తిలకించారు. తదుపరి విద్యార్థులతో కలిసి థింసా నృత్యంలో పాల్గొని, న్యాయనిర్ణేతలకు దుస్సాలువ, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. నెహ్రూ యువక కేంద్రం జిల్లా యువజన సంక్షేమ అధికారి కె.వెంకట్‌ఉజ్వల్ మాట్లాడుతూ 15 నుంచి 29 ఏళ్లలోపు వయసు గల యువత వివిధ విభాగాల ద్వారా ఈ ఉత్సవాల్లో పాల్గొనేలా అవకాశం కల్పించామన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన ప్రథమ స్థానం విజేతలను రాష్ట్రస్థాయికి, అందులో గెలుపొందిన వారికి జాతీయస్థాయికి పంపనున్నట్లు తెలిపారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సెట్విజ్ సిఇఒ బి.రామ్‌గోపాల్ మాట్లాడుతూ జానపద గీతాలు, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన వంటి పోటీలు ఈ ఉత్సవాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన తొలి స్థానం విజేతలు రాష్ట్రస్థాయికి వెళ్తారని, యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు మాట్లాడూతూ యువతలో ఉండే ప్రతిభ, కళా నైపుణ్యాలు వెలికి తీసేందుకు యువజన ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఇటువంటి వేదికలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపిఆర్‌ఒ ఎల్.రమేష్, ఎంఇఒ విమలకుమారి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శివనారాయణ, తహశీల్దారు వై.జయలక్ష్మి, ఎంపిడిఒ కె.రూపేశ్, ఎన్ఎస్ఎస్ పిఒ టి.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబ మూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం కూనేరు సంతలో ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై ప్రతిరోజు పోరాడుతున్న పార్టీ సిపిఎం అన్నారు. మండలంలోని ఏనుగులు సమస్య పైనా, పూర్ణపాడు -లాబేసు వంతెన, తోటపల్లి, జంఝావతి రిజర్వాయర్లు పూర్తి, గుమ్మిడి గెడ్డపై రిజర్వాయర్ తదితర సమస్యలపై నిలకడగా పోరాడుతున్న పార్టీ సిపిఎం అని అన్నారు. జిల్లాలో మన్యం ప్రాంతంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడిందని, వాటిని సమీక్షించుకొని--రాబోయే రోజుల్లో వీటిపైన పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధు, వెంకటేష్, రుబేష్, ఎర్రప్ప, కైలాస్, త్రినాథ్, ప్రసాద్, స్వామినాయుడు, దాలయ్య, గంగరాజు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడండి ... ప్రాణాలు రక్షించుకోండి

ప్రజాశక్తి - సీతంపేట

వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా వాడి ప్రాణాన్ని రక్షించుకోవాలని స్థానిక ఎస్సై వై.అమ్మనరావు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద వాహందారులకు అవగాహన కల్పించారు. శనివారం వాహనాలు తనిఖీ చేసినప్పటికీ ముందుగా హెల్మెట్ గురించి అడిగారు. హెల్మెట్ లేకపోతే వాహనం బయటకు తేవొద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరాస్త్రం వాడాలని చెప్పారు. హెల్మెట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐ సంజీవ్, హెచ్‌సి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇరిడి ఎన్నికల్లో ఎన్నికైన అవినాష్, కొండలరావు

సజావుగా పీసా చట్టం ఎన్నికలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో పీసా చట్టం ఎన్నికలు సుజావుగా జరిగాయి. ఇరిడి పంచాయతీలో నిర్వహించిన పీసా చట్టం ఎన్నికల్లో సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా బిడ్డిక కొండలరావు ఎన్నుకోబడ్డారు. గుమ్మలక్ష్మీపురం పంచాయతీలో పీసా ఎన్నికలు ఎన్నికల అధికారి ఎ.సత్యవతి ఆధ్వర్యంలో సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు అధ్యక్షతన జరిగాయి. ఉపాధ్యక్షులుగా బొత్తాడ రవిబాబు, కార్యదర్శిగా నిమ్మక దుర్గాప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బండారు నీలకంఠం, తాడంగి దమయంతి, పాలక ప్రేమానంద్, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, టిఆర్‌ఎఫ్ అధ్యక్షులు రొబ్బ లోవరాజు, ఐ.రామకృష్ణ, కొనిస మన్మధరావు, బి.వెంకట్రావు ఉన్నారు.

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

కురుపాం : మండలంలోని ఉదయపురం, జి.శివడ పంచాయతీల్లో శనివారం జరిగిన పీసా ఎన్నికల్లో ఎన్నికల అధికారులు రాధాకృష్ణ, సిహెచ్ సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. జి.శివడ పీసా ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటరావు, కార్యదర్శిగా ఎ.సాయికుమార్, ఉదయపురం పీసా ఉపాధ్యక్షులుగా కె.కామేశ్వరరావు, కార్యదర్శిగా వి.నీలమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు

కారిగెడ్డ వద్ద కల్వర్టు నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కర్రివలస వెళ్లే దారిలో కారిగెడ్డ వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని రాకపోకలకు, విద్యార్థులకు, రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా నాణ్యతా ప్రమాణాలతో కూడుకున్న కల్వర్టు నిర్మాణం చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం నాయకులు కె.ఈశ్వరరావు కోరారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో నిత్యం ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించి నాణ్యతా ప్రమాణాలతో కూడుకున్న కల్వర్టు నిర్మాణం చేపట్టి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. కల్వర్టు లేకపోవడంతో విద్యార్థులు సాలూరు, పాచిపెంట వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కావున యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణం పనులు వేగవంతం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పడాల మోహన్, ఎస్.గోపాల్, గెద్ద కూర్మయ్య ఉన్నారు.

భవిత కేంద్రంలో బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను శనివారం స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అవసరాల పిల్లల మధ్య జరిగిన ఈ వేడుకల్లో ఎంఇఒ కె.ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని, బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు ఓర్పుగా ఉండాలని, వారిలో అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భవిత కేంద్రం రిసోర్స్ పర్సన్లు ఆర్.తిరుమల దేవి, కె.అనిత, సిజివి ఆర్.గీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ బ్రెయిలీ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ ఎన్.సత్యనారాయణ పాల్గొని లూయిస్ బ్రెయిలీ గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులు చదువు కోసం బ్రెయిలీ లిపిని కనిపెట్టాడని కనిపెట్టిన లిపి వల్లే ఇప్పుడు అంధులు చదువుకోగలుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, భవిత ఉపాధ్యాయులు గౌరీశ్వరి, శ్రీదేవి, కోఆర్డినేటర్ శ్రావణి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కురుపాం : సభలో మాట్లాడుతున్న ఎంఇఒ సత్యనారాయణ

లక్ష్యాలను పూర్తి చేయాలి : హౌసింగ్ డిఇ

ప్రజాశక్తి - పాలకొండ

వంద రోజుల ప్రణాళికలో భాగంగా రెండో ప్రభుత్వం నిర్దేశించిన అర్బన్, గ్రామీణ గృహాల ప్రణాళికలకు అనుగుణంగా 59 శాతం పూర్తి చేసినట్లు మిగిలినవి పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది పని చేయాలని గృహనిర్మాణశాఖ డివిజనల్ అధికారి జి.రవి ఎఇలకు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి అవాస్ యోజన 2.0గృహాల మంజూరుకు సచివాలయాల్లో శుక్రవారం నాటికి డివిజన్‌లో రిజిస్ట్రేషన్ 3,623 పూర్తయ్యాయన్నారు. ఇంకా అర్హత గల వారికి రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. డివిజన్‌లో ప్రధాన మంత్రి జన్మాన్ స్కీమ్‌లో 4,898 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 1026 గృహాలు వివిధ స్థాయిలో నిర్మాణాల్లో ఉన్నాయని, మిగిలినవి గృహాలు పూర్తి చేయడానికి లబ్ధిదారులను మోటివేట్ చేసి తాపీమేస్త్రీలతో కలిసి పని చేయించాలని చెప్పారు. సచివాలయం వారీగా ప్రణాళికలు రూపొందించాలని, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలిసి పని చేయాలని చెప్పారు. జియో టాగింగ్ పక్కగా ఉండాలన్నారు. సమావేశంలో కురుపాం డిఇ, ఎఇలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ సిబ్బందిని హెచ్చరించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు రూ.12వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరింత వేగం పెంచి లక్ష్యాలు చేరుకునే దిశగా చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జె.సౌజన్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి బి.కృష్ణకాంత్, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నుంచి జనసేనలోకి భారీగా చేరికలు

ప్రజాశక్తి -సీతంపేట

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని వైసిపికు చెందిన పలువురు సర్పంచులు, నాయకులు శనివారం జనసేన లోకి చేరారు. చేరిన వారిలో కీసరజోడు పంచాయితీ సర్పంచ్ సున్నాపురం రవి, హడ్డుబంగి సర్పంచ్ సవర సుమతి, సర్పంచ్ భర్త సవర సన్యాసిరావు, కొండాడ పంచాయతీ సర్పంచ్ సవర ముకుందరావు, వార్డుసభ్యులు పువ్వల కైలాసరావు, సవర అప్పన్న, సవర రాజయ్య, సవర లక్ష్మణరావు, సవర గణేష్, సవర ధర్మారావు, సవర వెంకయ్య, సవర రమేష్, సవర కాంతారావు, చింతాడ పంచాయతీకి చెందిన సవర మల్లేష్, సవర సోమన్ని సవర కృష్ణారావు, సవర రామారావు, సవర పెంటయ్య, కార్యకర్తలు సవర ఆనందరావు, సవర ప్రేమ కుమార్, సవర జయరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, పాలకొండ పట్టణ టిడిపి అధ్యక్షుడు గంట సంతోష్, సీతంపేట మండల టిడిపి అధ్యక్షులు మొఖలింగం, ఐటిడిపి కోర్డినేటర్ పవన్, సంధ్యారాణి, కుమార్, రాజేష్, జనసేన పాలకొండ మండల నాయకులు మిడతాన ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయురాలు బి.ఆదిలక్ష్మికి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, ప్రసాద్, రామకష్ణారావు, నాగేశ్వరరావు, పైడిరాజు, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ సుశాంత్ జన అధ్యక్షత జరిగింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్ బోధకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని శనివారం ఎపి తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబును జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు ఎస్.అచ్యుతరావు, కర్నేని సాయిపవన్, ఉదయాన చరణ్, నందివాడ అనిల్, తదితరులు పాల్గొన్నారు

బైక్‌లు ఢీ కొని ఒకరు మృతి



ఘటనాస్థలంలో మృతి చెందిన స్వామి

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం పార్వతీపురంలో జరిగింది. పార్వతీపురం శివారు గెడ్డవీధి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్లు ఢీకొనడంతో పార్వతీపురం మండలం చిన్న బొండపల్లికి చెందిన గండి గుంపస్వామి (65) మృతి చెందారు. ఇదే ప్రమాదంలో మెంటాడ మండలం పసుపువానివలసకు చెందిన సిహెచ్ సింహాద్రి, సాయికుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామా జరిపి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని బాబూ జగజీవన్‌రావు కాలనీకి చెందిన అలజంగి అసిరయ్య (55) శనివారం మురుగు కాలువలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. అసిరయ్య మద్యం సేవించి మురికి కాలువలో పడిపోవడంతో గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాబు జగ్జీవన్ రావ్ కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు విషయం చేరవేయడంతో కుటుంబ సభ్యులు అక్కడ చేరుకుని మృతదేహాన్ని తరలించారు. మృతునికి భార్య పాపమ్మ, కుమారుడు దుర్గాప్రసాద్ ఉన్నారు .

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామస్తులకు, స్థానిక నాయకులకు ఇటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామసభను నిర్వహించామని చెబుతున్న పంచాయితీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ధోనిగెడ్డ, సంధివలస, మొలగవలస గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి రమణమూర్తికి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కొత్తగా ఏర్పడిన వెలగవలస పంచాయితీ గ్రామాల్లో కాలువలు, సిసి రోడ్లు నిర్మాణంతో పాటు మంచినీటి సదుపాయం కోసం శనివారం సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో తెలియపరిచేందుకు గ్రామస్తులు వెళ్లగా అప్పటికే గ్రామసభ నిర్వహించామని పంచాయతీ కార్యదర్శి తెలిపి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు, గ్రామ సభ నిర్వహణపై ముందస్తుగా గ్రామాల్లో తెలియపర్చలేదని, కనీసం సభలో ఎవరూ లేకుండా ఈ విషయమై సవాల్ నిర్వహించామని, తప్పుదోవ పట్టించిన పంచాయితీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పాలమెట్ట రాము, పి.భీమ, ఎం.ఉపేంద్ర, కుర్ర మహేష్, తాడంగి రోహిత్, వెలగ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి -పాలకొండ

చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఎందరు పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం ఇవ్వడం లేదని క్యాబినెట్‌లో తేల్చి చెప్పేశారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శనివారం ఆయన స్వగృహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు రాష్ట్రంలోని ప్రతి చోటా తల్లికి వందనంపై చేసిన ప్రచారం అంతా ఇంతా కాదన్నారు. ఇప్పుడు తల్లికి వందనం కార్యక్రమం లేదంటే దీనివల్ల పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని పున:ఆలోచన చేసి తల్లికి వందనం తొందరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కణపాక సూర్య ప్రకాష్, వంగర జడ్పిటిసి ప్రతినిధి కరణం సుదర్శన్‌రావు, నల్లి శివప్రసాద్, లోలుగు విశ్వేశ్వరరావు, కోట అజయ్ కుమార్ ఉన్నారు.



కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తులకు డబ్బులు చెల్లిస్తున్న జిసిసి మేనేజర్ కృష్ణ

అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెట్ ధర కల్పించి కొనుగోలు చేయడానికి జిసిసి ముందడగు వేసింది. దళారులు లేకుండా స్వయంగా జిసిసి అధికారులే సంతలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక జిసిసి బ్రాంచ్ మేనేజర్ దాసరి కృష్ణ కుసిమి సంతకు వెళ్లి గ్రేడ్ వన్ కొండ చీపురుకు రూ.45 జిసిసి మార్కెటింగ్ కల్పించిందని తెలిపారు. ఈ మేరకు 50,041 కొండచీపుర్లు కొనుగోలు చేశామని తెలిపారు. గ్రేడ్ -2కు రూ.40, గ్రేడ్-3కి రూ.35 ధర నిర్ణయించినట్టు తెలిపారు. కుసిమి, సీతంపేట, మర్రిపాడు, పూతికవలస, భామిని, పెద్దపొల్ల, దోనుబాయి, గొట్టుపల్లి, శంభాంలో అటవీ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. అలాగే చింతపండు కిలో పాత ధర 32.40కు గానూ ప్రస్తుతం రూ.34కు పెంచామన్నారు. పిక్క తీసిన చింతపండు కిలో రూ.63కు గానూ రూ.67కు పెంచామన్నారు. నల్ల జీడిపిక్కలు కిలో పాత ధర రూ.18 కాగా, కొత్త ధర రూ.22, కరక్కాయలు కిలో పాత ధర రూ.18, కొత్త ధర రూ.20, కుంకుడు కాయలు పాత ధర కిలో రూ.30, కొత్త ధర రూ.35కు నిర్ణయించామన్నారు. చింత పిక్కలు కిలో పది రూపాయలు కాగా, తాని కాయలు కిలో పాతధర రూ.15, కొత్త ధర రూ.18, ఎండి ఉసిరి పప్పు కిలో పాత ధర రూ.80 కాగా, కొత్త ధర రూ.90, ముసిడి పిక్కలు పాత ధర కిలో రూ.90 కాగా, కొత్త ధర కిలో రూ.100, ఇండుగా పిక్కలు ధర కిలో రూ.50 ధర నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాతపట్టణం జిసిసి మేనేజర్ జి.నర్సిం హులు, సేల్స్‌మెన్ ఎ.కుప్పేశ్వరరావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో ఎవరైనా ప్లాస్టిక్ వినియోగించినా, అమ్మకం చేపట్టినా ఇకపై ఉపేక్షించేది లేదని నగరపంచాయితీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు హెచ్చరించారు. ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హేమంత్ కుమార్, శానిటేషన్ సెక్రటరీతో పలు షాపులను తనిఖీ చేసిన అయన అపరాధ రుసుం విధించారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ యధావిధిగా ప్లాస్టిక్ వినియోగిస్తున్న రెండు షాపులను గుర్తించి వాటికి తాళం వేసి సీజ్ చేశారు. పట్టణంలో ఇకపై షాపుల యాజమాన్యం విధిగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని, దీనికి ప్రజలు తమ సహకారం అందించాలని ఆయన కోరారు. షాపుల యజమానులు ఇకపై తమ వైఖరి మార్చుకుని ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి ఉండాలని, లేకుంటే కేసులు నమోదు చేసి షాపులు సీజ్ చేస్తామని, అలానే కోర్టు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

గోకులం పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ముకుందపురం, పిపి ఈతమానుగూడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న గోకులం పనులను శనివారం ఎంపిడిఒ కె.గీతాంజలి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పశువుల శాల నిర్మాణం విలువ రూ.1,85,000, అందులో లబ్ధిదారుని వాటా పది శాతం. పశువుల శాల/క్యాటిల్ షెడ్ ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. ఈ నిర్మాణంలో ముఖ్యంగా పశువులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆ పరిసరాలు పారిశుధ్యంగా ఉంటాయని చెప్పారు. మండలంలోని పిపి ఈతమానగూడ, ధారపాడు, రోలుగుడ్డి, కోడిస, మండ, తాలాడ, సోమగండి, హడ్డుబంగి గ్రామపంచాయతీల్లో 17 గోకులం పనులు మంజూరు చేశామని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పనులపై ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నందున, గోకులం పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ విద్యాసాగర్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు..